క్లుప్తంగా

నేడు సత్రశాలలో 16 రోజుల పండగ



సత్రశాల(రెంటచింతల): మండలంలోని సత్రశాల వద్ద ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో బుధవారం 16 రోజుల పండగ నిర్వహించనున్నట్లు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి, ఈఓ గాదె రామిరెడ్డి శనివారం తెలిపారు. మహా శివరాత్రి వెళ్లిన 16 రోజుల తరువాత ఈ పండగను దేవస్థానంలో వసంతోత్సవంగా జరపడం ఆనవాయితీ అని, మహిళలు కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి దీవెనలను పొందుతారని దేవస్థానం ప్రధాన అర్చకులు చిట్యాల మల్లికార్జునశర్మ తెలిపారు.

పేదలకు సాయం చేయాలి

దాచేపల్లి : పేదలకు అండగా ఉండాలని సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు చెప్పారు. మండలంలోని కేసానుపల్లి గ్రామంలో గ్లోరీ సేవా సొసైటీ ఆధ్వర్యంలో 250 మంది పేదలకు శుక్రవారం రాత్రి కూరగాయలు పంపిణీ చేశారు. సర్పంచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేయూత అందించాలని, నిరుపేదల పట్ల ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెట్టిపాగు ఏసుదాసు, పంచాయతీ కార్యదర్శి మంగేశ్వరరావు, వీవోఏ మీసాల అచ్చయ్య, సంస్థ అధ్యక్షుడు కొత్రా మనోజ్, ఉపాధ్యక్షురాలు కొలా బ్యూలా, కార్యదర్శి మేకల మేరీకుమారి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షాలోం మందిర ప్రారంభోత్సవం

మాచర్ల: రెంటచింతల మండలంలోని రెంటాలలో స్వర్గీయ దేవదాసయ్య జ్ఞాపకార్థం కొత్తగా నిర్మించిన షాలోం మందిర ప్రారంభోత్సవం 5వ తేదీన జరగనుందని పాస్టర్ అభిషేక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నుంచి 7వ తేదీ వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రత్యేక సందేశాన్ని అందించేందుకు దైవసేవకులు ఎర్నెస్ట్ పాల్, శాంపాల్, ఇశ్రాయేలు వస్తారని వెల్లడించారు.

రేపు తిరనాళ్లపై సమీక్ష

దుర్గి: శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.రమేష కుమార్ శనివారం తెలిపారు. సమీక్ష సమావేశం 6న సోమవారం ఉదయం 11 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 12న నిర్వహిస్తున్న అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చేపట్టవలసిన చర్యల గురించి, చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి చర్చిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులతో పాటు మండలానికి చెందిన ప్రజా ప్రతినిధులు పలువురు నాయకులు హాజరై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. 8 మందికి గాయాలు



పిడుగురాళ్ల: రాజుపాలెం మండలం దేవరంపాడు గ్రామంలోని వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల మహోత్సవానికి పిడుగురాళ్ల మండలం జూలకల్లు గ్రామానికి చెందిన భక్తులతో వెళ్లిన ట్రాక్టర్ శనివారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో 8 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆ సమయంలో అక్కడే ఉన్న వినాయక హాస్పిటల్ డాక్టర్ నరేష్ వెంటనే స్పందించి అందరికీ చికిత్స అందించారు. తన హాస్పిటల్ అంబులెన్స్‌కు ఫోన్ చేసి అందరినీ ఆస్పత్రికి తరలించారు. వైద్య సేవలు, మందులు అందజేశారు.

భద్రతపై శ్రద్ధ అవసరం



సత్రశాల(రెంటచింతల): భద్రతపై అందరూ శ్రద్ధ పెట్టాలని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ హెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ (వర్క్స్) ఎంఎస్ఎన్ రాజు చెప్పారు. శనివారం కర్మాగారంలో జరిగిన భద్రతా దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారుల సూచనలు పాటిస్తూ భద్రతకు అధిక ప్రాధాన్యమిద్దామని చెప్పారు. ముందుగా జాతీయ భద్రతా జెండాను ఆవిష్కరించి కార్మికులచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ పర్సనల్ మేనేజర్ మల్లికార్జునరావు, వివిధ శాఖల అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

గడప వద్దకే వైద్యం



ఓ వృద్ధురాలికి ఇంటి వద్ద చికిత్స చేస్తున్న వైద్యురాలు, సిబ్బంది

- దిగ్విజయంగా ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం
- 14 రకాల వ్యాధులకు చికిత్స
- నడవలేని రోగులు, వృద్ధులకు ఇంటి వద్దే సేవలు

గురజాల : వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తోంది. నాడు–నేడు ద్వారా ఆస్పత్రులను ఆధునికీకరించింది. వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలు చేపట్టింది. ప్రజల గడప వద్దకే వైద్యం అందించేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. దీనిలో భాగంగా మరో అడుగు ముందుకేసి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోంది. వైద్యులు, వైద్య సిబ్బంది ప్రత్యేక వాహనాల్లో గ్రామాలకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. నడవలేని రోగులు, వృద్ధుల ఇళ్లకే వెళ్లి మరీ చికిత్స అందిస్తున్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలనూ సందర్శిస్తున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేస్తున్నారు. 14 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. అవసరమైన మందులు ఇస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామాల్లోనే ఉంటున్నారు. చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో గ్రామీణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గురజాల నియోజవకర్గంలో ఇలా..

గురజాల నియోజకవర్గంలో మాడుగుల, దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల, కరాలపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 55 గ్రామాలు ఉన్నాయి. పీహెచ్‌సీల్లో మొత్తం 10 మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు రోజుకొక గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలందిస్తున్నారు.

ప్రతి గ్రామానికీ వెళ్తున్నాం



ప్రతి గ్రామానికీ ప్రతి గడపకూ వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నాం. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. అవసరమైన వారికి చికిత్స చేసి ప్రభుత్వ వైద్యశాలకు రిఫర్ చేస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా మందులు ఇస్తున్నాం.

– పద్మావతి, మాడుగుల వైద్యురాలు

వైద్యసేవలు భేష్



గ్రామంలోకి వైద్యులు, వైద్యసిబ్బంది వస్తున్నారు. అందరినీ చూస్తున్నారు. ఉచితంగా మందులు ఇస్తున్నారు. అత్యవసరమైతే వైద్యశాలకు తరలిస్తున్నారు. ఆరోగ్య సేవలు చాలా బాగున్నాయి.

– ముండ్లపాటి విజయలక్ష్మి, గంగిరెడ్డిపాలెం

మంచి కార్యక్రమం



గ్రామంలోకి వైద్యులు, వైద్య సిబ్బంది రావడం మంచి కార్యక్రమం. ప్రభుత్వం పేదల ఆరోగ్యంపై శ్రద్ధపెట్టడం అభినందనీయం. ఈ విధానం వల్ల ఆస్పత్రికి వెళ్లలేని రోగులకు ఎంతో మేలు జరుగుతోంది. వ్యయప్రయాసలు తగ్గుతాయి.

– వట్టె రేణుక, చెన్నాయపాలెం

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలి



గ్రామ సచివాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి

దాచేపల్లి : వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అభివృద్ధి అధికారి వై.మహాలక్ష్మి చెప్పారు. మాదినపాడు గ్రామంలో శనివారం ఆమె పర్యటించారు. తొలుత గ్రామ సచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. నవరత్న పథకాల అమలుపై చర్చించారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. రానున్న వేసవిలో ఎండతీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని, ప్రధానంగా నీటి సమస్యలు రాకుండా చూడాలని మహాలక్ష్మి చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలు సమర్థంగా అమలు చేయాలని, అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా పనిచేయాలన్నారు. ఎస్‌డీజీ, ఆయుష్మాన్ భారత్ సర్వే పూర్తి చేయాలని, విద్యార్థుల కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఆప్‌లోడ్ చేయాలని సూచించారు. డీడీఓ వెంట ఈఓపీఆర్డీ మాధవీలత, సర్పంచ్ అనుముల అంజిరెడ్డి, తాటిపర్తి నర్సిరెడ్డి, ఎంపీటీసీ నంద్యాల వీరారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పాఠశాలలో ఇంటర్ విద్య అమలుకు కృషి



ఎత్తిపోతల ఆశ్రమ పాఠశాలలో జెడ్పీటీసీ మల్లుస్వామిని సన్మానిస్తున్న దృశ్యం



ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న విద్యార్థినులు

విజయపురిసౌత్: ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియెట్ విద్యను ప్రవేశపెట్టేలా కృషి చేస్తానని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మల్లుస్వామి చెప్పారు. శుక్రవారం రాత్రి ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్లుస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఎనలేని కృషి చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ జి.దుర్గాభవాని ఆధ్వర్యంలో మల్లుస్వామిని సన్మానించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ సూపరింటెండెంట్ పి.చంద్రరావు, తాళ్లపల్లి సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, ఎస్‌బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు కె.పాండునాయక్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం వెంకటేశ్వర్లు, వార్డెన్ వై.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు మల్లేశ్వరి, వాణి, నిర్మల పాల్గొన్నారు.

మహిళా హక్కుల పరిరక్షణకు ప్రత్యేక చట్టాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి శారదాదేవి, చిత్రంలో జడ్జి మధుబాబు తదితరులు

మాచర్ల : మహిళా హక్కుల పరిరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల జూనియర్ సివిల్ కోర్టు జడ్జి సి.మధుబాబు, అదనపు జడ్జి శారదా దేవి చెప్పారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ మహిళా కమిషన్ సౌజన్యంతో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మధుబాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జడ్జిలు మాట్లాడుతూ మహిళల హక్కులు, చట్టాల గురించి వివరించారు. అనంతరం జడ్జిలను మెప్మా ప్రాజెక్టు సీఈఓ రాజశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపల్లి శ్రీనివాస్, లోక్ అదాలత్ మెంబర్లు గౌస్‌పాషా, గట్ల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు ఆర్పీలు, కోర్టు సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయ సంఘ నాయకుడు మృతి

మాచర్ల: పట్టణంలో నివాసం ఉండే ఉపాధ్యాయుడు, ఉపాధ్యాయ సంఘ నాయకుడు శర్వన్ నాయక్ (45) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. పట్టణంలోని ఆర్‌కేసీ కాలనీ పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న శర్వన్ నాయక్ విధులలో ఉండగానే మరణించారు. ఎస్టీయూ నాయకునిగా, ఎమ్మార్పీగా ఆయన పనిచేశారు. శర్వన్ నాయక్ మృతి పట్ల ఎంఈఓ వేముల నాగయ్య, ఎస్టీయూ సంఘం జిల్లా నాయకులు గంగాధర్, శిలార్, రాజశేఖర్, భాస్కర్, రెవెన్యూ 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సోమ్లానాయక్, రిటైర్డ్ తహసీల్దార్ నందా నర్సింహయ్య, పలువురు యూనియన్ నాయకులు సంతాపం తెలిపారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

రెంటచింతల: ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం ద్వారా 2021–22 సంవత్సరంలో మండలానికి 401 ఇళ్లు మంజూరైనట్లు గృహనిర్మాణ శాఖ ఏఈ శ్రీనివాసరావు చెప్పారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. గోలి-10, జెట్టిపాలెం-5, మల్లవరం-13, మంచికల్లు-47, మిట్టగుడిపాడు-2, పాలువాయి-27, పాలువాయిగేటు-10, పశర్లపాడు -18, రెంటచింతల-97, రెంటాల-21, తుమ్మకోట-151 గృహాలు మంజూరు కాగా ఒక్కొక్క లబ్ధిదారునికి నాలుగు విడతలుగా రూ.1.80 లక్షలు అందించామని పేర్కొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీవైఈఓ వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రమణ మేడం స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి వి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన ఏడు మండలాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రమణ మేడం శిష్యులు పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. వ్యాసరచన పోటీల్లో పెదగార్లపాడుకు చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని జి.పూజిత, మాచర్లకు చెందిన శ్రీలక్ష్మీ, తేలుకుట్ల గ్రామానికి చెందిన డి.లక్ష్మీ ప్రణతి బహుమతులు గెలుచుకున్నారు. వక్తృత్వం పోటీల్లో గంగవరం గ్రామానికి చెందిన ఎంపీపీయూపీఎస్ విద్యార్థిని మానసప్రియ, షేక్ సాహిన, గామాలపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పి.శరణ్య బహుమతులు పొందారు. క్విజ్ పోటీలలో గురజాలకు చెందిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమస్థానం, మాచర్ల జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్ విద్యార్థులు ద్వితీయ స్థానం, మాచవరం జెడ్పీహెచ్ స్కూల్ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం సాధించారు. కార్యక్రమంలో ఎంఈవో ఒ.రాజు, ప్రధానోపాధ్యాయులు లింగాల ధనలక్ష్మి, కన్వీనర్ బైరెడ్డి, కార్యదర్శి వై.చందు, ఉపాధ్యాయులు రమణ, ఏడు మండలాల కో–ఆర్డినేటర్లు మురళి, అయేషా సుల్తానా, ఓర్సు సాగర్, అప్పారావు, రామలింగయ్య, సిహెచ్ గంగధర్ రావు, నరమాల హనుమంతరావు, వెంకటరెడ్డి, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహా.. నమో..



లక్ష్మీనరసింహ స్వామి విగ్రహం



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న యెనుముల, పోలు

గురజాల : శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కటాక్షం అందరిపై ఉండాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి ఆకాంక్షించారు. నగర పంచాయతీలోని జంగమహేశ్వరపురంలో కొత్తగా నిర్మితమైన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ విగ్రహాలు, ధ్వజస్తంభం ఊరేగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం జరిగింది. తొలుత విగ్రహాలకు, ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, శౌరెడ్డి, వీరంరెడ్డి అమరారెడ్డి, బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ పెద్దలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

దాచేపల్లి: హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ బిలాలుద్దీన్ శనివారం తెలిపారు. దాచేపల్లి నగర పంచాయతీలో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న గరికపాటి కోటేశ్వరరావు గతనెల 24న హత్యకు గురైన విషయం తెలిసిందే. హతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈకేసులో నిందితులుగా ఉన్న బంబోతుల సైదయ్య, అతని భార్య కోటమ్మ, కుమారుడు నాగరాజు, హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దాచేపల్లిలోని అచ్చాలగడ్డలో సంచరిస్తున్న వీరిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ బిలాలుద్దీన్ తెలిపారు. హత్యకు ఉపయోగించిన కర్ర, ద్విచక్రవాహనం, గొడ్డలి తదితర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

ఇంటిలో వృద్ధురాలు మృతి

ఆలస్యంగా వెలుగులోకి..

దుర్గి: అడిగొప్పల గ్రామంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్సీ కాలనీకి చెందిన రాయపాటి నాగమ్మ (65) అలియాస్ నాగులు మూడు రోజుల క్రితం ఇంటిలో మృతి చెందింది. ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కారంపూడి సీఐ డి.జయకుమార్, దుర్గి ఎస్ఐ కె.సతీష్, సిబ్బందితో ఘటనా స్థలాన్ని సందర్శించి పూర్తి వివరాలు సేకరించారు. మృతదేహం పూర్తిగా కుళ్ళిపోవడంతో దుర్వాసన వచ్చింది. దీంతో పోలీసులు, స్థానికులు ఇబ్బంది పడ్డారు. 108 సిబ్బంది మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డాక్టర్లు పోస్టుమార్టం నిర్వహించారు. ప్రాథమికంగా సహజ మరణంగా ధ్రువీకరించారు. మృతురాలికి భర్త, పిల్లలు లేరు. క్లూస్ టీమ్ డాగ్ స్క్వాడ్‌ను రప్పించి పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.


సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ వెంకటప్పయ్య అధికారులు, ప్రజాప్రతినిధులు

పిడుగురాళ్ల: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని సౌకర్యాలూ కల్పిస్తోందని డీఈఓ ఎం.వెంకటప్పయ్య చెప్పారు. పట్టణంలోని ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో సర్వశిక్షాభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. డీఈఓ ఎం.వెంకటప్పయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు మండలానికి రూ.పదివేల చొప్పున కేటాయించిందని వివరించారు. జెడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి ప్రసంగించారు. అనంతరం వైద్య శిబిరాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. డిప్యూటీ డీఈవో వై.వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.కాశయ్య, ఎంఈవో ఒ.రాజు, వైద్యులు చక్రవర్తి, భువనేశ్వరి, సతీష్, రాంబాబు, శ్రీనివాసరావు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యలో రాణిస్తే మంచి గుర్తింపు



పల్నాడు జిల్లా కలెక్టర్‌ను కలిసిన మాచవరం విద్యార్థులు

మాచవరం: విద్యలో రాణిస్తే మంచి గుర్తింపు లభిస్తుందని హెచ్ఎం బి.తాతిరెడ్డి చెప్పారు. పల్నాడు జిల్లా కేంద్రం నర్సరావుపేటలో గురజాల నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతుల్లో టాపర్లగా ఉన్న విద్యార్థులతో మీతో మీ కలెక్టర్ ఒక రోజు కార్యక్రమం శనివారం నిర్వహించారు. మాచవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9, 10 తరగతుల టాపర్ విద్యార్థులు ఏకుల చైతన్యకుమార్ , దేరంగుల యామిని కలెక్టర్‌ను కలిసి, ప్రభుత్వ విద్యా విధానంపై చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు, పథకాలను కలెక్టర్ వివరించారు. విద్యార్థులకు గైడ్‌గా హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు బీఎస్ఎన్ రాజు వ్యవహించారు.

పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించిన డీఎంఓ



సంజీవరెడ్డి నగర్ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించిన జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్

పిడుగురాళ్ల: స్థానిక సంజీవరెడ్డి నగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యులు బి.మణికంఠ, ఎంపీహెచ్ఈవో ఎస్.కాశీ విశ్వనాథం, సూపర్‌వైజర్లు వి.రామ గురవమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎస్‌కే రహీం, ఏఎన్ఎంలు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ తప్పనిసరి

మాచవరం: ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి చిన్నారులను, గర్భిణులను రక్షించుకునేందుకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా మలేరియా అధికారి రవీంద్ర రత్నాకర్ చెప్పారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మోర్జంపాడు, మాచవరం, పిన్నెల్లి, కొత్తపాలెం, పిల్లుట్ల, మల్లవోలు గ్రామాలను సందర్శించి, టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు చక్రవర్తి, ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం

విజయపురిసౌత్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన మత్స్యకారులు బొంది అడవిరాజు, చెల్లూరి బంగారి కుటుంబ సభ్యులకు రూ.5వేల చొప్పున మట్టి ఖర్చుల నిమిత్తం సొసైటీ తరుపున సహాయం చేసినట్లు స్థానిక మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే ముసలయ్య శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ముసలయ్య మాట్లాడుతూ బొంది అడవిరాజు, చెల్లూరి బంగారిలు అనారోగ్యంతో మృతిచెందడం బాధకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం సెక్రటరీ శ్రీను, ఉపాధ్యక్షుడు ఆనంద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి చేశారంటూ ఫిర్యాదు

నాదెండ్ల: పాతకక్షల నేపథ్యంలో అసభ్య పదజాలంతో దూషించడంతోపాటు దాడి చేసినట్లు పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. మండలంలోని గొరిజవోలు గ్రామం ఎస్సీకాలనీకి చెందిన పసల స్వప్న అదే గ్రామానికి చెందిన అల్లడి అంకమ్మరావు, జూపల్లి మరియదాసు, గారపాటి ప్రభుదాసుతో పాటు మరో ఏడుగురు ఈనెల రెండోతేదీన తన ఇంటపైకి వచ్చి దాడి చేశారంటూ ఆమె ఫిర్యాదులో పేర్కొంది. గాయపడిన ఆమె నరసరావుపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎ భాస్కర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.